

'శ్రీజ'లో 'లఖ్‌పతి దీదీస్'కు సత్కారం

ప్రజాశక్తి - తిరుపతి మంగళం



'శ్రీజ' డెయిరీలో శుక్రవారం 'లఖ్‌పతి దీదీస్'ను కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పి సింగ్ బాఘేల్ సత్కరించారు. తిరుపతి సమీపంలోని శ్రీజ మహిళ బాల ఉత్పత్తి సంస్థను శుక్రవారం సందర్శించారు. శ్రీజ సంస్థ కార్యాచరణ విధానాలను పరిశీలించారు. అద్భుతమైన ఆర్థిక మైలురాళ్లను సాధించిన మహిళా వ్యవస్థాపకులు 'లఖ్‌పతి దీదీస్'ను సత్కరించారు. ఈ ప్రాంతంలో మహిళలను శక్తివంతం చేయడంలో, స్థిరమైన, జీవనోపాధి అవకాశాలను అందించడంలో కీలకపాత్ర పోషించినందుకు శ్రీజ ఎంపిఒను ప్రశంసించారు. సాంప్రదాయ పాడిపరిశ్రమను మించి కోళ్ల పెంపకం, ఆక్వాకల్చర్, పందుల పెంపకం వరకూ మహిళల వ్యవస్థాపక కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు.

డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు శ్రీకారం



- మైస్ టూరిజం సెంటర్‌గా తిరుపతి
- వచ్చే క్యాబినెట్‌లో హోంస్టేలపై పాలసీ
- ఎకో టూరిజం అభివృద్ధికి కృషి
- రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తోందని, ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తూనే, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు శ్రీకారం చుట్టనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన రీజినల్ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. తిరుపతి నుండి సమీప ప్రాంతాలను అభివద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ఆహ్వానించామన్నారు. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబీ) ద్వారా రూ.3482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్ లో ఆమోదం లభించిందన్నారు. తద్వారా హోటళ్లలో 2,698 రూమ్ లు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అంతేగాక దాదాపు 11,645 మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటిదాకా రాష్ట్ర పర్యాటక రంగంలో రూ.10,280 కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చాయన్నారు. తద్వారా 1466 రూమ్‌లు ఏర్పాటు కానున్నాయన్నారు. వీటన్నింటిని గ్రౌండింగ్ చేస్తున్నామన్నారు.

రాయలసీమ ప్రాంతంలో టెంపుల్ టూరిజంతో పాటు స్థానికంగా ఉన్న ప్రకృతి సౌందర్య ప్రాంతాలను, వాటర్‌ఫాల్స్, టైగర్ రిజర్వు, పర్యాటకులను ఆకర్షిస్తోన్న వివిధ పర్యాటక ప్రదేశాలను, పురాతన కట్టడాలు, చారిత్రాత్మక కోటలకు విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతిలో యాంకర్‌హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. పిపిపి విధానంలో చేపట్టే పర్యాటక అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒకరోజు తిరుపతి దర్శనానికి వచ్చే భక్తుడు, యాత్రికుడుగా మారి రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి సమీపంలోని ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అందులో భాగంగా చంద్రగిరి ఫోర్ట్, శ్రీ వెంకటేశ్వర జువాలాజికల్ పార్క్, తలకోన జలపాతం, ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగిన సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్ట్స్, కాటేజీల నిర్మాణం చేపడతామన్నారు.

తిరుపతి సమీపంలో అట్ మోస్ఫియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలు రిసార్ట్స్, హెూటళ్ల నిర్మించేందుకు ఎంఓయూలు చేసుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ (మైస్) టూరిజంను అభివద్ధి చేస్తున్నామన్నారు. తిరుపతిలో డెస్టినేషన్ వెడ్డింగ్ లు సైతం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో కలిసి పర్యాటకంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టగలిగితే డెస్టినేషన్ వెడ్డింగ్ కు అవసరమైన కళ్యాణ మండపాలు, సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నట్లుగా క్యారవాన్ టూరిజంకు విస్తత స్పందన వస్తోందన్నారు. రాయలసీమలోని శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నామన్నారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్ పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా తర్వాత అత్యధిక అడవులున్న ప్రాంతంగా పేరుగాంచిన తిరుపతి అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివద్ధి చేస్తామన్నారు. అటవీ శాఖతో ఈ విషయమై సమన్వయం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో 10వేల హెూమ్ స్టేలు తీసుకొచ్చేందుకు హెూమ్ స్టే పాలసీని తదుపరి కేబినెట్ లో ఆమోదింపజేస్తామన్నారు. పాలసీ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అదే తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హెూమ్ స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, సూళ్లూరుపేట ఎంఎల్ఎ విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎపిటిడిసి ఎండి, ఎపిటిఎ సిఇఒ అమ్రపాలి కాట, నరసింహయాదవ్, సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్‌మోహన్, సిఐఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.

మాకు పని కల్పించండి : గైడ్స్ యూనియన్



కరోనా అప్పటి నుంచి శ్రీవారి ఆలయం మూసివేతతో తమకు పని లేకుండా పోయిందని, గైడ్ యూనియన్ నాయకులు వాపోయారు. ప్యాకేజీ దర్శనాలు రద్దు చేయడంతో తమపరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇంటి బాడుగలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. సిఎం చంద్రబాబుతో మాట్లాడి ప్యాకేజీ దర్శనాలు పునరుద్ధరించేలా చూస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

విరామమెరుగని నిత్య శ్రామికుడు

రాజ్యాంగస్ఫూర్తి కొనసాగిద్దాం / సీతారాం ఏచూరికి ఘన నివాళి


గూడూరులో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ యంత్రాంగం

హృదయాన నీవేనోయి.. నడకల్లో దారివోయి..
బతుకంత ధారగ పోసి.. బతుకంటే తెలియజేసి..
కలలాగ కదిలిపోయి జ్ఞాపకమై మిగిలావే..
కాలమెంత కఠినమో కామ్రేడ ఏచూరి

సిపిఎం పూర్వపు అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని ఆ పార్టీ శ్రేణులు విప్లవ స్ఫూర్తితో నివాళి అర్పించారు. జిల్లావ్యాప్తంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి 'విరామమెరుగని నిత్య శ్రామికుడు' అంటూ కొనియాడారు. తూడూరులో డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ ఆధ్వర్యంలో సభకు జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హాజరయ్యారు. సీతారాం ఏచూరి వర్ధంతి పురస్కరించుకుని సిపిఎం కార్యాలయానికి దాత లింగారెడ్డి సుబ్రమణ్యం రెడ్డి సహకారంతో అందించిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ విరామమెరుగని నిత్య శ్రామికుడు, పార్లమెంటేరియన్, ఉత్తమ బాషా కోవిదుడు, వామపక్షవాది సీతారాం ఏచూరి అందరి మనస్సులను గెలుచుకున్నారన్నారు. జెఎన్‌యుకు స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులుగా ఎస్ఎఫ్ఐ పక్షాన మూడుసార్లు ఎన్నికై విద్యార్థుల పక్షాన రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసినపుడు దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టే కృషిలో అగ్రభాగాన ఉన్నారన్నారు. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రధాని ఇందిరాగాంధీ ఓటమి చెందినప్పటికీ జెఎన్‌యుఛాన్సలర్ పదవిలో కొనసాగుతూ ఉండటాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా ఇవ్వాలని ఆమె సమక్షంలోనే డిమాండ్ పత్రాలు చదివి వినిపించిన సాహస నేతని కొనియాడారు. దీంతో ఆమె రాజీనామా ఇవ్వక తప్పలేదన్నారు. 2015లో పార్టీ 21వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై చివరి శ్వాస విడిచే వరకూ ఆ బాధ్యతలోనే కొనసాగారన్నారు. మతోన్మాదశక్తుల వల్ల దేశ సమైక్యతకు ముప్పు ఏర పడుతుంటే ఆందోళన చెందేవారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరామిరెడ్డి, ఎం.శివకుమార్, బివి రమణయ్య, జివి రమణయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

- నాయుడుపేటలో సిఐటియు కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శివకవిముకుంద, ఎన్.మహేష్‌బాబు, బి.వీరాస్వామి, ఎన్.శ్యామలమ్మ పాల్గొన్నారు.


- తిరుపతి టౌన్‌లో వేమన విజ్ఞాన కేంద్రంలో కెఆర్ఎస్ అధ్యక్షతన సభ జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడమే ఏచూరికి ఇచ్చే అసలైన నివాళి అన్నారు. ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించి అస్తిత్వ వాదాన్ని బలంగా కేంద్రంలోని బిజెపి తీసుకొస్తున్నదని, ఈ ప్రభావంలో పడి అనేకమంది మేధావులు సైతం రోజువారి ఎదురవుతున్న సాధారణ సమస్యలను సైతం గుర్తించలేని స్థితికి నెట్టివేయబడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, సిపిఎం నేతలు జయచంద్ర, సాయి లక్ష్మి, హేమలత, నాగార్జున పాల్గొన్నారు.



ఎస్వీయూ క్యాంపస్‌లో..

- క్యాంపస్‌లో జరిగిన సభలో జెఎన్‌యూ పూర్వ విద్యార్థి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలని ఆర్ఒఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రంగంపేట నారాయణ కళాశాలలో ఆయన సంస్మరణ సభ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగింది. పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారాం ఏచూరి చదువుకునే రోజుల్లో జెఎన్‌యు లాంటి విశ్వ విద్యాలయంలో గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. చదువుతూ పోరాటం సాగించి సాధారణ విద్యార్థి నుంచి అఖిల భారత స్థాయికి ఎదిగారన్నారు. సుదర్శన్, అక్బర్, వినోద్ పాల్గొన్నారు.

- సత్యవేడులో నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్, మెలుగు రమేష్ పాల్గొన్నారు. - నాగలాపురంలో మండల కార్యదర్శి మురగేష్ ఆధ్వర్యంలో జరిగింది. అముదమ్మ, దక్షిణామూర్తి, పద్మ, మేఘన పాల్గొన్నారు.


తిరుపతిలో..

22 నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు, ఇతర పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. అదేవిధంగా సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమినాడు శ్రీపద్మావతి అమ్మవారు రాత్రి 7.45 గంటలకు విశేషమైన గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా పది రోజుల పాటు కల్యాణోత్సవంను రద్దు చేశారు. 26న లక్ష్మీపూజ సేవలు రద్దయ్యాయి.

శ్రీవారి సేవలో నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - తిరుమల

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి అడిషనల్ ఈ ఓ వెంకయ్య చౌదరి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోంచేశారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు.

తిరుపతిలోకి 'కోడూరు'..?

నెలాఖరులో పునర్విభజన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన పరిపాలనా సౌలభ్యానికి అనుకూలంగా లేవని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలోనే కొన్ని హామీలను ఇచ్చింది. ఈ హామీల అమల్లో భాగంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో మండలాల మార్పులు చేర్పులు, కొత్తజిల్లాల ఏర్పాటుపైన అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఉన్న రైల్వేకోడూరును తిరుపతిలో కలపాలన్న బలమైన డిమాండ్ ఉంది. గంట వ్యవధిలో ప్రయాణ సౌలభ్యం ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలోకలిపే అవకాశం కనిపిస్తోంది. అలాగే గూడూరు నెల్లూరు జిల్లాకు సమీపంగా ఉండడంతో అక్కడి ప్రజల బలమైన డిమాండ్ మేరకు ఆ దిశగా యోచన చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్ నెలాఖరులోపు, లేదా అక్టోబర్ మొదటివారంలో ప్రభుత్వం చేసే మార్పులను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈసారి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాన అజెండా పెట్టి చర్చించే అవకాశం ఉంది. 2026, జనవరి 1 నుంచి 2027 మార్చి31 వరకూ 'జనగణన' కార్యక్రమం ఉన్న నేపథ్యంలో 2025, డిసెంబర్ లోపు కూటమి ప్రభుత్వం చేసే మార్పులు చేర్పులు ఫైనల్ కానున్నాయి.

రుయా సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రుయా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరుపతి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లాలప్పకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రుయాలో స్వీపర్లుగా పనిచేస్తున్నారని, ఏ వన్ ఫెసిలిటీ అండ్ ప్రాపర్టీ మేనేజర్ ప్రైవేట్ కాంట్రాక్టర్ మూడు నెలలుగా జీతం ఇవ్వలేదన్నారు. రుయా యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆ కాంట్రాక్టు కాలపరిమితి అక్టోబర్ 15 నాటికి ముగుస్తుందన్నారు. తమకు అన్యాయం జరగకుండా బకాయి జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇప్పించాలని కోరారు. యూనియన్ నాయకులు ఎం.నిర్మల, పి.ఉషారాణి, నీలవేణి, కామాక్షి, మునెమ్మ, కుమారి, లక్ష్మి, మునిరాజా, అమ్ములు ఉన్నారు.

సాంకేతిక సహాయకులను విధుల్లోకి తీసుకోండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో సస్పెండ్ అయిన 11 మంది సాంకేతిక సహాయకులను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని జిల్లా సాంకేతిక సహాయకుల అసోసియేషన్ అధ్యక్షులు వెంకటాచలపతి డ్వామా కార్యాలయంలో పీడి శ్రీనివాస ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సహాయకుల జాబ్ చార్ట్ నిబంధనల ప్రకారమే విధులు నిర్వర్తిస్తామని, దినసరి వేతనం క్షేత్రస్థాయి కొలతల ప్రకారమే వేతనాలు చెల్లింపు, సహాయ సహకారాలు అందించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కష్ణయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి స్వామి దాసు, కోశాధికారి నాగభూషణం పాల్గొన్నారు.

రజకుల దోబీఘాట్ స్థలాన్ని కాపాడాలి :సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీ పరిధిలోని రజకుల దోబీఘాట్‌ను భూ కబ్జాదారుల నుండి ప్రభుత్వం కాపాడాలని సిపిఎం జిల్లా నాయకులు జయచంద్ర, రూరల్ కార్యదర్శి కె.సుమన్ డిమాండ్ చేశారు. రజకుల దోబీఘాట్ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్న చంద్రముదిరాజు, మాజీ సర్పంచి చిరంజీవిరెడ్డిలను తక్షణం అరెస్టు చేసి, స్థలాన్ని కాపాడాలన్నారు. 214 సర్వే నంబర్‌లో 56 సెంట్లును రజకులకు 2006లో ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత 30 ఏళ్లుగా ఆ భూమిలోకి రజకులు రానీకుండా అడ్డుకుంటున్నారన్నారు. కోర్టులో సైతం రజకులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. రజకుల స్థలాన్ని ప్రభుత్వం కాపాడని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రజక సంఘం నాయకులు జి.శంకర్, మధుకుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రకాశం పార్కులో వాకర్స్‌ట్రాక్ గుంతలు పూడ్చాలి : సిపిఎం

ప్రజావక్తి - తిరుపతి టౌన్



ప్రకాశం పార్కులో వాకర్స్‌ట్రాక్‌లో నీళ్లు నిల్వకుండా గుంతలు పూడ్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. పార్కుకు ప్రతిరోజూ వందలాది మంది మహిళలు, పురుషులు, పిల్లలు వాకింగ్, యోగా, స్కేటింగ్ చేయడానికి, ఆడుకోడానికి వస్తుంటారన్నారు. చిన్నపాటి వర్షం పడినా వాకర్స్‌ట్రాక్‌లో నీళ్లు నిలిచిపోవడం వల్ల వాకర్లకు ఇబ్బందిగా మారుతోందన్నారు. పార్కులో ప్రవేశం వద్ద ఎడమవైపు లైటింగ్ లేదని, షటిల్ కోర్టులో కాంక్రీట్ బదులు మెత్తగా మ్యాట్ వేయాలన్నారు. స్కేటింగ్ గ్రౌండ్ చుట్టూ తూర్పు వైపున వర్షపునీరు నిలిచి బురదమయం అయ్యిందన్నారు.

నూతన ఆలోచనలతో మహిళా సాధికారతకు నాంది

తిరుపతిలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు / మీడియాతో ప్రసన్నకుమార్ సూర్యదేవర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



మహిళా సాధికారతపై దేశవ్యాప్తంగా పార్లమెంటు, శాసనసభ కమిటీలు పనిచేస్తున్నాయని, మొట్టమొదటిసారిగా తిరుపతి జిల్లా వేదికగా మహిళా సాధికారత కోసం మహిళా స్వశక్తీకరణ కమిటీ జాతీయ సదస్సును లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా స్వయంగా ప్రారంభించనున్నారని, ఈ రెండు రోజుల సదస్సు కోసం మొదటి రోజు ముఖ్యఅతిథిగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రోడ్డు మార్గంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఈనెల 14, 15 తేదీల్లో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఒక రాష్ట్రంలో శాసనసభ కమిటీలు ఏ విధంగా పనిచేస్తున్నాయి, మరో రాష్ట్రంలో ఆ కమిటీల పనితీరు ఏ విధంగా ఉంది అని తెలుసుకుంటేనే పటిష్టమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆలోచన చేసిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కొత్త ఆలోచన చేసి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్లమెంటులో మహిళా స్వశక్తీకరణ కమిటీ ఒక జాయింట్ కమిటీలో 20 మంది లోక్ సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారన్నారు. సాధారణంగా లోక్ సభ సభ్యుల్లో ఒకరు కమిటీకి ఛైర్ పర్సన్ గా ఉంటారని, ప్రస్తుతం పురందేశ్వరి చైర్పర్సన్ గా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటువంటి కమిటీలే అనేక రాష్ట్రాల శాసనసభల్లో, శాసనమండలిలో ఉంటాయని, మన రాష్ట్రంలో కూడా ఇది ఒక సంయుక్త కమిటీ అని, ముగ్గురు శాసన మండలి సభ్యులు, తొమ్మిది మంది శాసనసభ్యులతో పాటు, మన రాష్ట్రంలో సంయుక్త కమిటీకి గౌరు చరితా రెడ్డి చైర్పర్సన్ గా వ్యవహరిస్తారన్నారు. మొదటిసారి రెండు నెలల క్రితం ఎస్టిమేట్ కమిటీ సమావేశాన్ని మహారాష్ట్రలో, ఎస్సీ ఎస్టీ కమిటీ సమావేశాన్ని భువనేశ్వర్ లో నిర్వహించి మూడవ దఫాగా మహిళా స్వశక్తీకరణ, మహిళా కమిటీల సంక్షేమ సమావేశం మన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల మధ్య జరగాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించి ఆయన సూచనలతో జాతీయ సదస్సు నిర్వహణకు లోక్ సభ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సదస్సుల ప్రారంభ కార్యక్రమానికి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటుగా సీఎం చంద్రబాబు నాయుడు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరి వంశ్, ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణం రాజు, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, లోక్ సభ కమిటీ చైర్ పర్సన్ పురందేశ్వరి, ఏపీ రాష్ట్ర కమిటీ చైర్ పర్సన్ గౌరు చరితారెడ్డి హాజరై మహిళా సాధికారత పై ప్రసంగిస్తారన్నారు. ప్రిలిమినరీ సెషన్స్ లో రెండు మూడు థీమ్స్ పై కూలంకుషంగా చర్చించి తీర్మానం చేయనున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ఉన్న కమిటీలు అందరూ హాజరవ్వడం సాధ్యం కాదని ప్రతి కమిటీ నుంచి ప్రతి రాష్ట్రం నుండి నలుగురు సభ్యులు, ఒక చైర్ పర్సన్ నామినేట్ చేయాలని స్పీకర్ సూచించారన్నారు. 15న ఉదయం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ హాజరవుతారన్నారు. మహిళా సాధికారత కోసం పెద్ద ఎత్తున విజయవంతం అవ్వడానికి యంత్రాంగం మొత్తం కృషి చేస్తోందన్నారు.

రేపు చంద్రబాబు తిరుపతికి రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 14, 15 తేదీల్లో తిరుపతిలో మొట్టమొదటిసారిగా జరగనున్న 'మహిళా సాధికారత పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు'ను విజయవంతం చేద్దామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. 14వ తేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సదస్సులో పాల్గొంటారన్నారు. శుక్రవారం జేసీ శుభంబన్సల్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుతో కలిసి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నోడల్ అధికారులకు, లైజాన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మహిళా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. రాహుల్ కన్వెన్షన్ హాలులో సీటింగ్, స్టేజి ఏర్పాట్లు క్రమపద్ధతిగా ఉండేలా చూడాలన్నారు. అతిథులు వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకూ విధులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్, లోక్‌సభ స్పీకర్, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, సీనియర్ ఐఎఎస్‌లు రానున్నారని తెలిపారు. తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి దర్శనాల ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి సిఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. శ్రీ కన్వెన్షన్ హాలులో జరిగే ప్రైవేట్ కార్యక్రమానికి, తిరుచానూరు బైపాస్‌లోని రాహుల్ కన్వెన్షన్‌లో జరిగే సదస్సుకు సిఎం హాజరుకానున్నారు.



హరిబాబుకు దళితవీర్ అవార్డ్



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో-ఆర్డినేటర్ నత్తం హరిబాబు శుక్రవారం దళితవీర్ అవార్డును అందుకున్నారు. అంబేద్కర్ భావజాలంతో దళితులకు నిలబడినందుకుగాను "దళిత పల్లెవీరుల మహోత్సవం" సందర్భంగా గుంటూరులో అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, మాజీ మంత్రి డొక్కామాణిక్య వరప్రసాద్ లు హరికి అవార్డును అందజేశారు.

కిరణ్ కుమార్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కిరణ్ కుమార్ కు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని సీఈ బి. రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు పర్యవేక్షణలో "ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం/నియోడియం మరియు ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్" అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలను సమర్పించారు.

న్యాయ శాస్త్రంలో సోనికా బొడ్డేకు..



ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని సోనికా బొడ్డే కు డాక్టరేట్ అందజేశారు. న్యాయ శాస్త్ర విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.ఇందిరా ప్రియదర్శిని గారి పర్యవేక్షణలో "లీగల్ పెర్స్పెక్టివ్ ఆఫ్ మనీ లాండరింగ్ ఇన్ ఇండియా" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సోనికా సమర్పించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా డాక్టర్ రమణ



ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎంవి రమణ పదోన్నతి పై ఎన్జీరంగా వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. డాక్టర్ రమణ వ్యవసాయ వర్సిటీ నందు వివిధ హోదాలలో గత 34 సంవత్సరాలుగా బోధన, పరిశోధన రంగాలలో సుదీర్ఘమైన సేవలు అందించారు. ముఖ్యంగా ఇరిగేషన్ ఇంజనీరింగ్, నీరు భూసార సంరక్షణ అంశాలపై విశేష అనుభవజ్ఞులు. డాక్టర్ రమణ వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం నందు ఇప్పటివరకు ఏడు మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఇద్దరు పిహెచ్డీ విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. నూతన రిజిస్ట్రార్ గా మెరుగైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ గంగరాజు

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ పి. గంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పరిపాలన భవనం నందు ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య జెవి రమణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న డాక్టర్ వై. రవీంద్రారెడ్డి పదవీవిరమణ పొందిన కారణంగా కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ పి గంగరాజు రెండు సంవత్సరాల కాలపరిమితికి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పి. గంగరాజు మాట్లాడుతూ డెయిరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధి కోసం ఉన్నతాధికారుల సహకారంతో, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది అందరి సహాయ సహకారాలతో కళాశాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కందుల దుర్గేష్‌ని కలిసిన చక్రధర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను శివారం రో తిరుపతిలో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రాంత రాజకీయ పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు.

దామా మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-తొట్టంబేడు: టిడిపి సీనియర్ కార్యకర్త చోడవరం దామా మృతి పార్టీకి తీరని లోటని ఆయకట్టు చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. దామా(43) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి, తొట్టంబేడు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్‌లు దామా మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎర్రయ్య, రమేష్, చిరంజీవి, సుబ్రహ్మణ్యం, శంకరయ్య, పోలయ్య, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ జ్యోతి సుధాకర్ నాయుడును శుక్రవారం ఉదయం ఆమె స్వగృహంలో పద్మమాల, పాదపల్లి, తిమ్మయపాలెం, కొత్తపాలెం, తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు రవీంద్ర బాబు, దామ్, కృష్ణమూర్తి సుధాకర్ గ్రామ సెక్రెటరీ ప్రసాద్ నాయుడు టీడీపీ నాయకులు రవి రెడ్డి శివకుమార్ మనీ ఆర్ కుమార్, మండల పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌కు పూర్వ విద్యార్థి చేయూత

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం దోర్నకంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఆర్థికసాయాన్ని అందజేసి పూర్వ విద్యార్థి బోధన నేర్పించుటకు దోర్నకంబాలకు చెందిన పూర్వ విద్యార్థి బైరెడ్డి భాను ప్రకాష్ 10 కంప్యూటర్లు డొనేట్ చేసి, కంప్యూటర్ ఇనస్ట్రక్టర్‌ను నియమించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని పాఠశాల విద్యార్థులు కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవడమే కాకుండా కేంద్రీయ విద్యా శాఖ నిర్వహించిన పరీక్షలో పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా దాత బైరెడ్డి భాను ప్రకాష్ ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, విద్యాభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ విద్యార్థులు డిజిటల్ విద్యలో ప్రతిభ కనబరచాలని ప్రకాష్ తెలియజేశారు. కార్యక్రమంలో విద్యాభిమానులు లలిత కుమారి, భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ.. సమస్యలే అన్నీ..!

- డ్రైనేజీ అస్తవ్యస్తం
- వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బందులుపడుతున్న కాలనీ వాసులు
- సమస్యలను పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గాంధీనగర్ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా డ్రైనేజీలు, రహదారులపై మురుగు నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. కాలువల్లో ఖర్జూర చెట్లు మొలుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. అక్కడ నివసించే 70 కుటుంబాల వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. కాలనీలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పేద ప్రజల సొంతింటి కల నేరవేర్చాలన్న ఆశయంతో ఏర్పాటు చేసిన కాలనీలు దుర్భరస్థితిలో ఉన్నా స్థానిక నాయకులకు చీమ కుట్టినట్టు కూడా లేదు. చిట్టడవిని తలపిస్తూ పిచ్చి మొక్కలు, ముళ్ల కంపాల మధ్య జీవనం దుర్భరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతూ, దోమల వృద్ధి చెంది, విషజ్వరాల పాలవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల చుట్టూ గుబురు పొదలు ఏర్పడ్డాయి. పాముల బెడద పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయపడి పోతున్నారు. వర్షం పడితే చాలు ఇంటినుంచి బయట అడుగు పెట్టే అవకాశం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీకి తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో అధికారులున్నారు. కాలనీ మహిళలు సుమారు ఒక కిలోమీటరు దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



వానొస్తే బురదే..!



చుట్టూ.. పొదలే..!

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు ఆకాలనీని పట్టించుకొని కనీస సౌకర్యాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వీధి కుళాయి కోసం ఎన్నిసార్లు వినతులిచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదు. చర్యలు తీసుకోవాలని హామీలిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వర్షాకాలమైతే కాలనీ బురద మయమయి అడుగు బయట పెట్టలేని స్థితి ఏర్పడుతోంది.

- చింతకాయల జ్యోతి, జగనన్న కాలనీ వాసురాలు

రోడ్లు బాగు చేయాలి



కూటమి ప్రభుత్వం తమ కాలనీని పట్టించుకోలేదు. రహదారులు లేవు. డ్రైనేజీలు లేవు. మంచినీరు లేదు. ఒక కిలోమీటర్లు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి పోతున్నాం. మా పిల్లలు జ్వరాలతో భాధడుతున్నారు. మా సమస్యలను ఎన్నోసార్లు విన్నవించినా ఫలితంలేదు. రెక్కాడితే కానీ, డొక్కాడని మా బతుకులు బాగుచేయాలి.


- పట్టపు రాజేశ్వరమ్మ జగనన్న కాలనీ వాసి

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పి ఆర్ సి కమిటీని ఇంతవరకు నియమించకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగులంతా రెండు సంవత్సరాల పీఆర్సీ కాలాన్ని నష్టపోయారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే 12వ పి ఆర్ సి కమిషన్‌ను నియమించి, దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతి జిల్లా సభ్యత్వ అభియాన్‌లో భాగంగా శుక్రవారం పుత్తూరు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివ కుమార్, జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా క్రీడా కన్వీనర్ గురప్ప, జిల్లా అకాడమిక్ కన్వీనర్ గురవయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తొట్టంబేడు మండలంలోని చిగువ సాంబయ్యపాలెం ఫౌండేషన్ స్కూల్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పోతు దామోదర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. బాలు తెలుగు భాష, ప్రాథమిక విద్యాభివృద్ధికి చేసిన కృషికి గాను అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని దామోదర్ రెడ్డి అన్నారు. సురేంద్ర రెడ్డి, ఆంటోనీ, బాలాజీ, అరుణ్, మహేష్, చిరంజీవి, అల్లావుద్దీన్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్‌కు క్రీడాకారులు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తూర్పు గోదావరి జిల్లా, మండపేటలో 13, 14 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి 49వ టెన్నికాయిట్ టోర్నమెంట్ (సీనియర్ బాలబాలికలు) పోటీలకు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ జట్టు గూడూరు నుండి బయలుదేరి వెళ్లారు. ఈ క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, మల్లికార్జున పాల్గొన్నారు.

నృత్య, గాన పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కళా ఉత్సవ్ 2025లో నిర్వహించిన నృత్య, పాటల పోటీల్లో పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి ప్రథమ స్థానాన్ని పొందారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి అభినందించారు. నృత్య పోటీల్లో యోగిత, మహేశ్వరి, వర్షిణి, శ్రీ లక్ష్మి విజేతలుగా నిలిచారని తెలిపారు. సంగీత పోటీల్లో భవి, దీపాశ, పూజిత, అర్చనలు విజేతలు, సోలో సంగీత పోటీలో రేణు ప్రియ జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు.

ఎంపిపిగా బాధ్యతలు చేపట్టిన జమ్ముల శ్రీనివాస్ యాదవ్



ప్రజాశక్తి - ఏర్పేడు : ఏర్పేడు మండల ఎంపీపీగా జమ్ముల శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం అధికారికంగా ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీటీసీ నియోజక వర్గం తరఫున గత కొన్ని ఏళ్లుగా ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించిన గీత గతంలో తమ రాజీనామా లేఖను ఉన్నతాధికారులకు పంపడం జరిగింది. పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు వైస్ ఎంపీపీ2గా విధులు నిర్వహిస్తున్న జమ్ముల శ్రీనివాస్ యాదవ్‌ను అధికారకంగా ఉత్తర్వులు జిల్లా ఉన్నత అధికారులు జారీ చేయడంతో ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో ఎంపీపీగా నియమించడం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో నూతన ఎంపీపీగా జమ్ముల శ్రీనివాస్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు.

రాయలసీమ రంగస్థలి కళా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి మహతి కళాక్షేత్రంలో శుక్రవారం టిటిడి సౌజన్యంతో రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి, సెక్రటరీ కేవీఎన్ రాజ సారధ్యంలో పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...తిరుపతి మహతి కళాక్షేత్రంలో చిన్నారుల ప్రదర్శనలు అద్భుతంగా చేశారని వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. మహతి కళాక్షేత్ర వేదికపై సాంస్కృతిక నృత్య పౌరాణిక ప్రదర్శనలు చేసిన వారు శ్రీవారి అనుగ్రహంతో దేశవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించాలన్నారు.

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శుక్రవారం జాతీయ భాష, హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి అధ్యక్షత హిందీ ఉపాధ్యాయురాలు మాధవీలత విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ మన దేశ జాతీయ భాషగా, పాఠశాలల్లో త్రిభాషా సూత్రాన్ని అమలుచేస్తూ భాషల ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తిస్తున్నాయన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: పాపానాయుడుపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారయ్య ఆధ్వర్యంలో హిందీ ఉపాధ్యాయులు హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి పోటీలలో విజేతలకు బహుమతులందించారు. హిందీలో ప్రావీణ్యం కనపర్చిన విద్యార్థులకు బహుమతులిచ్చారు.

రజకులపై చిన్న చూపు ఎందుకు..?



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడిచిన రెండు దశాబ్దాలుగా టీడీపీనే నమ్ముకుని సేవలందిస్తున్న రజక సామాజిక వర్గానికి చెందిన వల్లంకుంట అశోక్‌ను తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ గుడి పాలకమండలిలో సభ్యునిగా నియమించమని జిల్లా పార్టీ, నియోజకవర్గ ఇన్చార్జికి రజకులు ఐక్యంగా మద్దతు ఇచ్చినప్పటికీ అన్యాయమే జరిగిందని రాష్ట్ర రజక సాధికార సమితి కార్యదర్శి సాకల శంకరన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రజక సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. టిడిపిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిలో ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్యతను కల్పిస్తూ, పార్టీ శ్రేయస్సు కోసం నిర్వహించే కార్యక్రమాల్లో విరివిగా మద్దతుగా పాల్గొనే రజకులను పక్కన పెట్టడం సరైనది కాదన్నారు. తిరుపతి నియోజకవర్గంలో 15వేల మంది ఓటు బ్యాంకు కలిగిన రజకులను చిన్నచూపు చూడడం ఇకనైనా మానుకొని, రాష్ట్ర కమిటీలో ఇద్దరు రజకులకు స్థానం కల్పించాలని, వల్లంకుంట అశోక్‌ను తాతయ్యగుంట గంగమ్మ గుడి పాలకమండలి సభ్యునిగా నియమిస్తూ ఆదేశాలను సవరణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గంధం బాబు, యశోద, దినేష్, గుణశేఖర్, అక్కినపల్లి లక్ష్మయ్య, రాజయ్య, గంధం వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కృషి మరువలేనిది

ప్రజాశక్తి - క్యాంపస్ : యూనివర్సిటీ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు చేసిన కృషిని ఎన్నటికీ మరువమని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు పేర్కొన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు శుక్రవారం సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొంది 15 ఏళ్ల కాలం పూర్తి చేసుకున్న 35 మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ వర్సిటీకి విశ్రాంత ఉద్యోగులు అందించిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల అనుభవాలు ఈ తరం ఉద్యోగులకు అవసరమని పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ దేవేంద్రనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, రిటైర్డ్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం రెడ్డి, విజయ్ కుమార్, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ విజయవంతం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏపీలో కూటమి ప్రభుత్వం పాలన సఫలీకృతమైదనం, ప్రజలకు మరింత చేరువైందుకు సూపర్ సిక్స్ పథకాలు దోహదపడ్డాయని ఏర్పేడు మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు పేర్కొన్నారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. అయితే కొంతమంది వైసీపీ నేతలు ప్రజల్లో, రైతుల్లో ఆందోళన రేకెత్తించే రీతిలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. రైతులకు ఎరువుల సరఫరా చేయడం లేదంటూ వైసిపి నాయకులు పోరుబాట పేరుతో ప్రభుత్వంపై బురద చల్లడం తగదన్నారు.అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

మిషన్ శక్తి సంకల్పపై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట క్లస్టర్ పాపా నాయుడుపేట జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మిషన్ శక్తి సంకల్ప పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత, వాణి విద్యార్థులకు బాలల హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, జీవన నైపుణ్యాలలో భాగంగా స్వీయ సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మారయ్య, కళాశాల ప్రిన్సిపల్ జి ప్రభాకర్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ ఉమా, అంగన్వాడి టీచర్లు గోవిందమ్మ, శారదమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ డివిజన్ పరిధిలోని కొన్ని సబ్ స్టేషన్లలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు పుత్తూరు రూరల్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్ తెలిపారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనులు, అలాగే విద్యుత్ లైన్ల వెంట పెరిగిన చెట్లు తొలగించే కార్యక్రమం జరుగనున్నందున క్రింది సబ్ స్టేషన్లలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. పైడిపల్లి, కళ్యాణపురం, దిగువపుత్తూరు, పరమేశ్వర మంగళం ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

అంగన్వాడీకి ఏల్ఈడీ టీవీ వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధి, స్థానిక ఎంబి రోడ్డులోని అంగన్వాడి కేంద్రానికి పుత్తూరు బిజెపి మండల కమిటీ అసెంబ్లీ కన్వీనర్ కేఎన్ హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారుల విద్యాభివృద్ధికి ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందించారు. పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కార్యకర్తలు, అభిమానులు జీ.ఉదయ కుమార్ , ఎం.శేఖర్ మూర్తి ఓ.వెంకటరమణ, శేషారెడ్డి మహేంద్ర బాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి కొత్తరకం వరి విత్తనాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో రబీ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులకు 1262, 1271 ఎం.టియు. రెండు కొత్త రకాల వరి విత్తనాలు అందుబాటులోకి తెచ్చినట్లు వ్యవసాయాధికారుల తెలిపారు. నెలవాయి, సూళ్లూరుపేట ఫెడ్ ఫార్మా ప్రొడ్యూసర్స్ గోదాములో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విత్తనాలు అధిక దిగుబడితోపాటు, వ్యాధి నిరోధక శక్తి కలిగినవని వివరించారు. రాబోయే రబీ పంటలో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు ఈ విత్తనాలను వినియోగించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం తగిన పరిమాణంలో విత్తనాలు నిల్వ చేసి సబ్సిడీ ధరలకు అందజేస్తామని సూళ్లూరుపేట ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ తుమ్మల కన్నయ్య నాయుడు తెలిపారు.

నానో యూరియా వాడకంపై అవగాహన.. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వ్యవసాయ శాఖ తరపున రైతులకు బయో ఫెర్టిలైజర్స్, నానో యూరియా, నానో డిఏపి మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కనమనంబేడు గ్రామపంచాయతీలో రైతులు మానవహారం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ అధికారి షణ్ముగం మాట్లాడుతూ నానో ప్లస్ యూరియా 20% గాఢతతో రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు.

కంప్యూటరీకరణ పూర్తి కావాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) : తంగేళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రికార్డుల కంప్యూటరీకరణ త్వరగా పూర్తిచేయాలని తిరుపతి డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి సురేష్ కుమార్ సిబ్బందికి ఆదేశించారు. స్థానిక సంఘ కార్యాలయాన్ని శుక్రవారం సురేష్ సందర్శించారు. ఈఆర్పి పద్ధతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్డిఎల్సిఓస్ రవికుమార్, విజయ్ కుమార్, శ్రీకాళహస్తి డిసిసి బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్, సీఈఓ చిరంజీవి రెడ్డి గారు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా విషయక క్యాలెండర్ పంపిణీ

ప్రజాశక్తి - పాకాల: మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యా విషయక క్యాలెండర్ పంపిణీ చేయడం జరిగిందని పాకాల మండల విద్యా శాఖాధికారి లింగయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చిన క్యాలెండర్‌లను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ క్యాలెండర్‌లో ఏయే నెలలో ఏమిమి పాఠాలు బోధించాలో ఉంటాయని దానిని అనుసరించి ఉపాధ్యాయులు పాఠాలు భోధించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: అటవీ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా ఎర్రచందనం రవాణా చేస్తున్నారని తన సిబ్బందితో కలిసి నిఘా వేసామని భాకరాపేట అటవీక్షేత్ర అధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. 11వ తేదీ గురువారం చింతకుంట పంచాయతీ పసుపులేటివారిపల్లి సమీపంలోని మామిడి తోటలో రాత్రి 11 గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో శుక్రవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో కారులో ఎర్రచందనం లోడు చేస్తుండగా అటవీశాఖ సిబ్బంది దాడి చేశారు. స్మగ్లర్లు కారును ఎర్రచందనం కొయ్యలను వదిలేసి పారిపోయారని తెలిపారు. మొత్తం ఏడు ఎర్రచందనం కొయ్యలు ఉండగా వాటి బరువు 169 కేజీలు, సుమారు 5 లక్షలు విలువ చేస్తాయని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ ఓ, సలావుద్దీన్, ఎఫ్ బిఓ లు, ప్రదీప్ చాంద్, రాజేష్ కుమార్, సదాశివయ్య, డ్రైవర్ శంకర్ మరియు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు



వేపేరి పురుషోత్తం రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం : రామచంద్రాపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో వీరంగం సృష్టించి, అధికారులను దుర్భాషలాడిన వేపేరి పురుషోత్తం రెడ్డిపై తహశీల్దార్ మధుసూదన్ రావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆర్ సి పురం పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు వేప కుప్పం గ్రామానికి చెందిన వేపేరి పురుషోత్తం రెడ్డి, తన భార్య ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం 6వ తేదీన తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తహశీల్దార్ రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తుండగా, పురుషోత్తం రెడ్డిని కొంతసేపు వేచిఉండమని కార్యాలయ సిబ్బంది చెప్పారు. పురుషోత్తం రెడ్డి ఎందుకు బయట వెయిట్ చేయాలి..? అంటూ నేరుగా తహశీల్దార్ ఛాంబర్‌లోకి వెళ్లి, ఆధార్ అప్లికేషన్ పై సంతకం పెట్టండని కోరారు. దీంతో తహశీల్దార్ ఆధార్ కార్డులో తిరుపతి రూరల్ మండలానికి చెందిన అడ్రస్ ఉంది కాబట్టి తిరుపతి రూరల్ తహశీల్దార్ దగ్గర సంతకాలు చేయించుకోమని సలహా ఇచ్చాడు. దాంతో కోపోద్రికుడైన పురుషోత్తం రెడ్డి నువ్వు పబ్లిక్ సర్వెంట్, ఎందుకు సంతకం పెట్టవు...? మేము చెప్పిన చోటు సంతకం పెట్టాలి. నీ కథ చూస్తా..? నీపై కలెక్టర్కు ఫిర్యాదు చేసి నీ ఉద్యోగం ఊడదీస్తానంటూ పరుషంగా మాట్లాడాడు. గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు మోహన్, గంగయ్య, గీతలు అతన్ని ఎంత నచ్చ చెప్పినా వినకుండా సిబ్బందిపై చిందులు వేశాడు. దీంతో సిబ్బంది అతడిపై ప్రభుత్వ కార్యాలయంలో, విధులకు ఆటంకం కలిగించి, దౌర్జన్యానికి పాల్పడి, వీరంగం సృష్టించాడని ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కైలాస థామం నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలో నిర్మిస్తున్న కైలాస థామానికి విశ్రాంతి ఉద్యోగుల సంఘం తరపున 2 లక్షల 16 రూపాయలు విరాళం అందించారు. వారికి ఎమ్మెల్యే పులివర్తి నాని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కురుమూర్తి రెడ్డి, కార్యదర్శి నరసింహ రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్డ్ 2.0 ను తీసుకువచ్చింది. ఈ విధానంలో రిజిస్ట్రేన్లకు సంబంధించి వినియో గదారులు తమ సెల్‌కు వచ్చే ఒటిపిలను రిజిస్ట్రేషన్ సమయంలో చెప్పాల్సి ఉంటుంది.గతంలో డేటా ఎంట్రీ వేసేటపుడు ఆధార్ మాత్రం చెక్ చేసుకునే వారని, ఇపుడు డేటా ఎంట్రీ చేస్తుంటే పత్రాలు తాలూకు పార్టీలకు ఆధార్, మొబైల్ ఓ.టి.పి లతో ముందుకు వెళ్ళే పరిస్థితి వచ్చిందని గూడూరు రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉండే సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రాయసం సుబ్బారావు తెలిపారు.అన్ని డాక్యుమెం ట్లకు ఓ.టి.పి విధానం సరికాదన్నారు. పవర్ ఆఫ్ అటార్నీలు, చెల్లు రసీదులు, ఫోన్లు లేనివారు, వేరే వారి ఫోన్‌కి లింక్ చేసుకుంటే సైబర్ క్రైమ్స్ జరుగే ఆవకాశం ఉందన్నారు. మున్సిపల్ టాక్స్ ఆటో మ్యుటేషన్ కూడా ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ, మున్సిపల్ వ్యవస్థలు సరైన విధంగా అప్డేట్ కాలేదన్నారు. ఆన్లైన్ రికార్డ్ సరి చేయలేదన్నారు. ఆటో మ్యుటేషన్ కంపల్సరీ అని తీసుకువచ్చిన కారణంగా ప్రజలు రిజిస్ట్రేషన్ విషయమై చాలా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. గతంలో ప్రైవేట్ అటెండెన్స్ కింద ఎమర్జెన్సీ పరిస్థితుల్లో రిజిస్ట్రార్ వారు ఇంటికి వచ్చి రిజిస్టర్ చేసేవారని, ఇప్పుడు అలా చెయ్యా లంటే జిల్లా రిజిస్ట్రార్ వారి అనుమతి, లాప్ టాప్ అవసరమని తెలిపారు. ఏదైనా సాఫ్ట్వేర్ లోపాలు తలెత్తితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా రోజులు పడుతోందన్నారు.ఈ విషయమై నెల్లూరులో రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కి వినతి పత్రం సమర్పించినా ప్రయోజనం చేకూరలేదన్నారు. రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చే వారికి ఏ రోజు పని ఆ రోజు లేదా తదుపరి రోజు అయ్యే పరిస్థితి రాష్ట్రం మొత్తం మీద లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈనెల15 వ తేదీ నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో గల డాక్యుమెంట్ రైటర్ లు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బూడిద వాక వెంకట రత్నం ఆచారి, నరేంద్ర రెడ్డి, మురళి, మహబూబ్ భాషా, యూసఫ్ హుస్సేన్, పసుపు లేటి బాల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.